శ్రీవారి సేవలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్

విశాలాంధ్ర-తిరుమల: ఆదివారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ దేవస్థానం పరిసర ప్రాంతాల్లో రాత్రి మరియు ఉదయం సందర్శన చేయడం జరిగిందని కొంత మంది బాలలు బిక్షాటన చేయడం, బొమ్మలు మరియు ఆట వస్తువులు అమ్ముతున్న పిల్లలను గమనించడం జరిగిందని తెలిపారు. తక్షణమే ఆలయ ముఖ్య అధికారులు, సిబ్బంది, విజిలెన్స్ అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. బడి బయట పిల్లలను గుర్తించి తిరిగి వారిని పాటశాలలో చేర్పించే దిశగా విద్యా శాఖ అధికారులు అడుగులు వేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యాపార సంస్థలు ప్రతినిధులు బాలలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కేసులు నమోదు చేయాలని హెచ్చరికలు జారీ చేశారు.

దేశంలో తొలిసారిగా పిండ మార్పిడి పద్ధతిలో సాహివాల్ దూడ జననం

- దాతల సహకారంతో దేశావాళీ గోవుల అభివృద్ధి

- సాహి వాల్ దూడకు పద్మావతిగా నామకరణం: టీటీడీ ఈవో ధర్మారెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: దేశంలో తొలిసారిగా పిండ మార్పిడి (సరోగసి) పద్ధతిలో ఒంగోలు ఆవుకు సాహివాల్ దూడ జన్మించినట్లు టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ గోశాలలో ఆదివారం ఈవో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి సూచనలతో టీటీడీ, ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్తంగా దేశావాళీ గోజాతులను అభివృద్ధి చేయాలని గత ఏడాది ఎంఓయు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మేలు రకమైన దేశవాళీ గో జాతిని అభివృద్ధి చేసే క్రమంలో ఎస్వీ గో సంరక్షణశాలలోని మేలు జాతి ఆవుల నుండి అండం సేకరించి, ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలోని ఐవిఎఫ్ ల్యాబ్‌లో కృత్రిమంగా పిండాలను అభివృద్ధి చేశారన్నారు. వీటిని టీటీడీ గోశాలలోని ఆవులలో ప్రవేశపెట్టి దేశంలోనే తొలిసారిగా విజయం సాధించినట్లు ఈవో తెలిపారు. ఈ ప్రక్రియలో శనివారం రాత్రి ఒంగోలు జాతి ఆవుకు జన్మించిన సాహివాల్ దూడకు పద్మావతి అని నామకరణం చేసినట్లు చెప్పారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ధూప దీప నైవేద్యాలకు, నిత్య కైంకర్యాలకు అవసరమయ్యే పాలు, పెరుగు, వెన్న, నెయ్యిని దేశవాళీ ఆవుపాల నుండి ఉత్పత్తి చేయాలని నిర్ణయించినట్లు తెలియజేశారు. ఇందుకోసం ఇప్పటికే 200 దేశీయ గోవులను దాతలు సమకూర్చారని, మరో 300 గోవులను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. ఆవుల ఆరోగ్య పరంగా, అధిక పాల దిగుబడి దిశగా నాణ్యత కలిగిన దాణా తయారీ చేసుకోవడానికి ఇటీవలే గోశాలలో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ప్రారంభించినట్లు చెప్పారు. అదేవిధంగా గోశాలలో రోజుకు సుమారు 3 వేల నుండి 4 వేల లీటర్ల ఆవు పాలను ఉత్పత్తి చేయనున్నట్లు ఈవో తెలిపారు. రోజుకు 60 కేజీల స్వచ్ఛమైన నెయ్యిని సాంప్రదాయ పద్ధతిలో తయారు చేసి స్వామి వారి నిత్య కైంకర్యం, నైవేద్యాలకు వాడేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రైతులకు టీటీడీ ఉచితంగా గోవులను అందిస్తోందని అన్నారు. గోశాలలో ఉన్న షెడ్లలో మార్పులను చేయడం, ఇసుక తిన్నెలను ఏర్పాటు చేసి గోవులకు సహజ సిద్ధమైన వాతావరణాన్ని కల్పించామన్నారు . గోశాలలోనే కాకుండా తిరుపతి పరిసర ప్రాంతాల్లో సేంద్రీయ పద్ధతుల్లో పండించిన పచ్చి మేతను కొనుగోలు చేసేందుకు కలెక్టర్ తో సంప్రదించామన్నారు. రానున్న రోజుల్లో ఇంకా మెరుగైన ఫలితాలు పొందేందుకు వీలుగా నూతన షెడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. ఎస్వీ పశు వైద్య విశ్వవిద్యాలయం విసి డాక్టర్ పద్మనాభరెడ్డి మాట్లాడుతూ రానున్న 5 సంవత్సరాల్లో 324 మేలు రకమైన సాహివాల్ గోజాతి దూడలను ఉత్పత్తి చేయడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా పిండ మార్పిడి చేయబడిన ఆవులలో ఇప్పటి వరకు 11 గోవులు గర్భం దాల్చినట్లు తెలిపారు. ఒక ఆవు శనివారం రాత్రి సాహివాల్ పెయ్య దూడకు జన్మ నిచ్చిందన్నారు. రానున్న రోజుల్లో ఇంకా 10 సాహివాల్ దూడలు జన్మించనున్నాయని తెలియజేశారు. ఇదే కాకుండా లింగ నిర్ధారిత వీర్యాన్ని ఎస్వీ గోశాలలో ఉన్న సాహివాల్, గిర్ గోవులలో కృత్రిమ గర్భధారణ ద్వారా ప్రవేశపెడతామన్నారు . దీనివల్ల సరోగసి చెందే ఆవు లక్షణాలు దూడకు రావని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మేలు రకమైన దేశీయ జాతి గోవులను రైతులకు సబ్సిడీపై అందించవచ్చని ఆయన వివరించారు. జేఈవో సదా భార్గవి, గో సంరక్షణ ట్రస్ట్ సభ్యులు శ్రీరామ్ సునీల్ రెడ్డి, గో సంరక్షణ శాల డైరెక్టర్ హరినాథరెడ్డి, ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ వీర బ్రహ్మయ్య, శ్రీ వెంకట్ నాయుడు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ రివర్ ఫ్రంట్ ఎస్టేట్స్ సభ్యులు రూ.80 వేలు విరాళం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీ శ్రీ శ్రీ నల్లగంగమ్మ అమ్మవారికి వెండి కవచమునకు రివర్ ఫ్రంట్ ఎస్టేట్స్ సభ్యులు రూ.80 వేలు విరాళంగా అందించారు. పట్టణంలోని బహుదురుపేట, తిట్టు కాడ వెలసిన శ్రీ శ్రీ శ్రీ నల్లగంగమ్మ అమ్మవారి దేవస్థానం నకు భక్తుల యొక్క విరాళాలతో వెండి కవచము చేయుటకు ఆలయ కమిటీ సభ్యులు సంకల్పించారు. దీనిలో భాగంగా ఆదివారం రివర్ ఫ్రంట్ ఎస్టేట్స్ వారి ఆధ్వర్యంలో ఎం.సుబ్రహ్మణ్యం నాయుడు, కంటా వెంకటేశ్వర్లు, జి వెంకట్రామానాయుడు, విజయబాబు, చిలుకూరు సిద్దు నాయుడు, దొడ్డ నాగేశ్వరరావు, కోదండన్, సోమశేఖర్, రుద్ర రాజు, చంద్రబాబు తదితరులు దేవస్థానమునకు 80000 రూపాయలు నగదును విరాళం అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ కంట రమేష్, కమిటీ సభ్యులు ప్రదీప్, అనిల్, నారాయణ, పూజారి శంకర్ , గుణ , కపిల్ తదితరులు మాట్లాడుతూ వెండి కవచంకు ధన రూపేనా, వస్తురూపేనా విరాళాలు అందించి, అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు. అలాగే విరాళాలు అందించిన రివర్ ఫ్రంట్ ఎస్టేట్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కంటా రమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహాభారతం ఉత్సవాలకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కి ప్రత్యేక ఆహ్వానం

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :తిరుపతి రూరల్ మండలం ముండ్లపూడిలో జరుగుతున్న మహాభారతం ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే చెవిరెడ్డిని గ్రామ పెద్దలు ఆహ్వానించారు. ఆదివారం ఆయన ఇంటి వద్దకు వచ్చిన ఉత్సవ కమిటీ పెద్దలు ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులకు ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు. ఈనెల 21 నుంచి ప్రారంభమైన మహా భారతం ఉత్సవాలు 18 రోజుల పాటు నిర్విఘ్నంగా జరుగుతుందని చెప్పారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు వీలు కల్పించుకుని తప్పక హాజరు అవుతారని ఎమ్మెల్యే చెవిరెడ్డి స్పష్టం చేశారు.

ఘనంగా పూతలపట్టు రామకృష్ణయ్య సంస్మరణ సభ

విశాలాంధ్ర-తిరుపతి: ప్రముఖ జానపద గాయకుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బుర్రకథ ప్రధాన కధకులు సాంఘిక సంక్షేమ శాఖలో సంరక్షణ అధికారిగా పదవీ విరమణ చేసి దళితులు ఆదివాసీలు ఇతర పేద వర్గాల అసమానతలను రూపుమాపడానికి అనేక పాటలు గేయాలు నాటికలు నాటకాలు వేయడంలో వేయించడంలో సుప్రసిద్ధ అనుభవిజ్ఞులైన పూతలపట్టు రామకృష్ణయ్య గారి సంస్మరణ సభ ఆదివారం తిరుపతి యూత్ హాస్టల్ నందు ప్రముఖ కొరియోగ్రాఫర్ భాను కుమార్ అధ్యక్షతన సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ జడ్జి గుర్రప్ప గారు మాట్లాడుతూ నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి విలువలు కూడుకున్న జీవితానికి ప్రాధాన్యత ఇస్తూ ఈనాటికి కుల వర్గ అసమానతతో బాధపడుతున్న ప్రజల మార్పు కోసం తన కలం ద్వారా పాటలతో సమాజాని చైతన్య పరచడం జరిగింది అని కొనియాడారు రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి అంజయ్య మాట్లాడుతూ కళ కళ కోసం కాదు సమాజం కోసం అని గీటు గీసుకుని గ్రామస్థాయి నుంచి దేశ స్థాయి వరకు అనేక ప్రదర్శనలు ఇచ్చి రాష్ట్రస్థాయి జాతీయస్థాయి నాయకులు సైతం అబ్బురపరిచే విధంగా తన పాటలు వినిపించిన వ్యక్తి రామకృష్ణయ్య భౌతికంగా దూరమైన అతని పాటల ద్వారా గుర్తుండిపోతారని గుర్తు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ అధ్యక్షులు కేవీ రమణ న్యాయవాది సుబ్రహ్మణ్యం మోడల్ స్కూల్ లెక్చరర్ హరి డిఎంఎస్ స్టూడియో అధినేత మెట్టపల్లి విశ్వనాథరెడ్డి అభిమానులు కుటుంబ సభ్యులు కార్యకర్తలు బంధువులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

యువగళంకు అనూహ్య స్పందన

జనంతో కిక్కిరిసి స్వర్ణముఖి వారధి
పసుపుమయంగా మారిన పట్టణం
రాజకీయ చతురత చూపిన వేనాటి

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట పట్టణపరిధిలో ఆదివారం కొనసాగిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతమైంది. తిరుపతి పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, తిరుపతి జిల్లాలో లోకేష్ పాదయాత్ర ప్రారంభం నుంచి తన రాజకీయ చతురతను చూపారు. సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ దశాదిశా నిర్నేతగా, తెలుగుదేశంపార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభ్యున్నతికి పనిచేస్తున్న వేనాటి కుటుంబం ఆశాజ్యోతి, ఈ ప్రాంత ప్రజలు కష్ట సుఖాలలో వెన్నంటూ ఉండే వేనాటి సతీష్ రెడ్డి ఈ పాదయాత్రతో నారా లోకేష్ కు మరింత చేరువయ్యారు. సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను ఒకే తాటిపై నడుపుతూ, 137వ రోజుకు చేరుకున్న యువగళం పాదయాత్ర విజయవంతానికి సతీష్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. మేనకూరు గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్రకు జనాలు తండోపతండాలుగా తరలివచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా ఆటోలలో, ట్రాక్టర్లలో ఈ పాదయాత్రకు తరలివచ్చారు. నాయుడుపేట పట్టణం వద్దకు పాదయాత్ర, స్వర్ణముఖి కాజ్వే మీదగా చేరుకుంది. స్వర్ణముఖి నది కాజువే పూర్తిగా జనసంద్రంగా మారిపోయింది. నారా లోకేష్ పట్టణపరిధిలో గాంధీ మందిరం వద్ద పార్టీ నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ తీరును తూర్పారబట్టారు లోకేష్ మాట్లాడిన ప్రతి మాటకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పాదయాత్ర మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు ఇంతటి ప్రజాస్పందన కనిపించలేదని పార్టీ నాయకులే మాట్లాడుకుంటూ కనిపించారు. బహిరంగ సభ అనంతరం పాదయాత్ర నాయుడుపేట పట్టణం గ్రామదేవత పోలేరమ్మ గుడి మీదుగా, పాత బస్టాండ్ సెంటర్ వద్దకు చేరుకుంది. అనంతరం ఆయన పాదయాత్ర మాజీ మంత్రి, ప్రస్తుత శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య మామగారైన పసల పెంచలయ్య స్వగ్రామం తుమ్మూరు మీదగా నాయుడుపేట పట్టణం పరిధిని దాటి మండల పరిధిలో ప్రవేశించింది. పాదయాత్ర విజయవంతానికి వేనాటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ అబ్జర్వర్ కంభం విజయరామిరెడ్డి దిశ నిర్దేశికంతో మండల, పట్టణ పార్టీఅధ్యక్షులు కామిరెడ్డి అశోక్ రెడ్డి, కందల కృష్ణారెడ్డి అహర్నిశలు కష్టపడ్డారు. యువగళం పాదయాత్ర ప్రజలను విశేషంగా ఆకర్షించింది. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచుకోట వలె ఉన్న నాయుడుపేట నందు, పాదయాత్ర విజయవంతం కావడంతో తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆనందం అవధులు దాటింది.

వాస్తవాలు గ్రహించకపోతే చంద్రబాబు, పవన్ కల్యాణ్ మరింత పతనం కావడం ఖాయం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి నగర పాలక సంస్థ 21 వ డివిజన్ లో ఆదివారం ఉదయం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడప కార్యక్రమంలో భూమన కరుణాకర రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.జగనన్న ప్రభుత్వం తమ జీవితాల్లో వెలుగులు నింపడానికి కావల్సిన ప్రతి మేలూ చేస్తోందని ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని భూమన కరుణాకర రెడ్డి అన్నారు. ఏ ఒక్కటైనా చేయలేదన్న అసంతృప్తి ఏ ఒక్కరిలోనూ కనపడ లేదన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు, ఆయనతో పాటు పవన్ కళ్యాణ్ చేస్తున్న విమర్శలకు, వాస్తవాలకు ఎంతో తేడా ఉందన్నారు. ఈ వాస్తవాన్ని గ్రహించకపోతే ఆ ఇద్దరూ మరింతగా పతనం కావడం ఖాయమని భూమన హెచ్చరించారు. జగనన్న చేసిన, చేస్తున్న పనుల కారణంగా జగన్నపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసాలు పెరిగాయన్నారు. జగనన్న పట్ల కృతజ్ఞత చూపాలన్న తపన వాళ్ళల్లో కనపడుతోందన్నారు.పనిగట్టుకుని విమర్శించే చంద్రబాబు నాయుడు ముఠాకి గుణపాఠం చెప్పాలన్న పట్టుదల ప్రజల్లో బలంగా ఉందని తెలిపారు. ప్రతి ఇల్లు కూడా జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో సంతోషంలో మునిగితేలుతోందని చెప్పారు. ముఖ్యంగా పేద వర్గాలు నివసిస్తున్న ఇళ్లల్లో ఆనందం మరింతగా వెల్లివిరుస్తోందని వివరించారు. ధనవంతులు, పెత్తందారుల వైపున ఉన్న చంద్రబాబు నాయుడుకు, ఆయనకు మద్దతు ఇస్తున్న పవన్ కళ్యాణ్ కి పేదల కష్టాలను పట్టించుకునే మనస్సు లేదని భూమన విమర్శించారు. పేదల పక్షాన నిలబడే తత్వం ఉన్న జగనన్న పట్ల.... ఆ పెత్తందారుల వైపున నిలబడే వాళ్లకు వ్యతిరేక భావన కనపడటం పెద్ద ఆశ్చర్యం కాదని అభిప్రాయపడ్డారు. పేదల పక్షాన నిలబడదాన్ని ఆచరణలో చూపిస్తున్న కారణంగా పేద ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని, ఇది అక్షర సత్యమని భూమన పేర్కొన్నారు. ఎన్ని విమర్శలు ఎదురైనా 80శాతం ఉన్న పేదల పక్షానే జగనన్న నిలబడతారని భూమన పునరుద్ఘాటించారు.

సుధీర్ రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేయెద్దు

జీవగ్రం వరద ముంపుకు కారణం సుబ్రమణ్యం రెడ్డి ,పురుషోత్తం రెడ్డి, అత్తూరు హరి

విశాలాంధ్ర - రేణిగుంట : బొజ్జల సుధీర్ రెడ్డి చేస్తున్న రాజకీయాలు దిగజారుడు రాజకీయాల్లా ఉన్నాయని బొజ్జల కుటుంబం స్థాయికి ఏమాత్రం లేవని వైఎస్ఆర్సిపి నాయకుడు పురుషోత్తం రెడ్డి తెలిపారు. రేణిగుంట వైఎస్ఆర్ సీపీ కార్యాలయం లో ఆదివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పురుషోత్తం రెడ్డి పై విధంగా అన్నారు. ఈ సందర్భంగా పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు భుజం తట్టాలని ఎమ్మెల్యే సీటు బొజ్జల సుధీర్ రెడ్డి కే దక్కాలని ఆవేశంలో, ఆక్రోషం లో ఏది పడితే అది మాట్లాడుతున్నాడని అన్నారు. మా భూములు జోలికి వస్తే ఎవరైనా ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని మా కుటుంబం ఆనాటి నుండి నేటి వరకు నీతి నిజాయితీగా బతుకుతోందని అన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు మాచంద్రారెడ్డి తండ్రి గాజులమండ్యం పాఠశాలలో వస్తువులు అమ్ము కోలేద, ఇప్పుడు అదే స్కూల్ ను కబ్జా చేసి ప్రైవేట్ బిల్డింగ్ కడితే ఉరుకు న్నావు, నువ్వు లబ్ది పొంది నువ్వే అమ్మిచ్చావు నువ్వు నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది అని అన్నారు. జడ్పిటిసి సంధ్య మాట్లాడుతూ టిడిపి నాయకుడు సుబ్రహ్మణ్యం రెడ్డి కారణంగానే జీవగ్రం, కేఎల్ఎం హాస్పిటల్ ప్రాంతంలో వరద వచ్చి ప్రజలు పూర్తిగా ఇబ్బంది పడ్డారు. కారణం ఎలమండ్యంలో మీ ప్రోత్సాహంతో మీ బంధువులు కాలువను ఆక్రమించడం వలన నీరు అటు పక్కకు పోలేక వరద వచ్చింది వాస్తవమా కాదా అని మండిపడ్డారు. ఎంపీపీ కొత్తూరు హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక 2024 లో జరుగు ఎమ్మెల్యే ఎన్నికలలో మరలా మధుసూదన్ రెడ్డి గెలుస్తాడని, ఆ విషయం తెలిసి భరించలేకనే ఇటువంటి నిందారోపణలు ఎమ్మెల్యే పై చేస్తున్నారని అన్నారు. రేణిగుంట ఉపసర్పంచ్ ఇర్ఫాన్ మాట్లాడుతూ భాష భుజాలు తట్టించుకునే దాని గురించి మా పార్టీకి నువ్వు నేర్పించాల్సిన అవసరం లేదు. హైకోర్టు న్యాయవాది మునిరెడ్డి ని టార్గెట్ చేసి అతనిపై మీ బొజ్జల సుధీర్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తే, అందుకు సమాధానంగాముని రెడ్డి వివరణ ఇచ్చాడు. దాంట్లో ఏదైనా ఉంటే మరల సుధీర్ రెడ్డి మాట్లాడాలి అంతేకానీ ఊర్లో పెళ్లికి కుక్కల హడావుడి లాగా మీరు వచ్చి ఎందుకు భుజాలు తడుముకుంటున్నారో అర్థం కావడం లేదు. ఇప్పుడు మీరు ఆయన దగ్గర భుజం తట్టించుకునే దానికి ఏదేదో మాట్లాడుతున్నారు. ఇక పార్టీల విషయం కొస్తే వీధిలో పడి కుక్కల్లా కొట్లాడుకునేది మా పార్టీ వారు కాదు, కుక్కల్లా కోరుక్కునేది మా పార్టీ వారు కాదు పోలీస్ స్టేషన్ దగ్గర దిగజారి ప్రవర్తించింది మేము కాదు. ఇక పంచాయితీ బోర్డు సమావేశం విషయానికొస్తే ఆరోజు 30 ఏళ్ల తర్వాత అత్తూర్లో జాతర జరుగుతుందంటే ఎంపీపీ హరి ప్రసాద్ రెడ్డి ఆ ఊరు కాబట్టి కచ్చితంగా అందరూ అక్కడికి వెళ్లాలని సమావేశం డేట్ మార్చాలని మేము చెప్పాం . కార్యదర్శి కి సరైన సమయంలో చెప్పలేక పోవడం వలన పంచాయతీ కార్యదర్శి దాన్ని అమలు చేయలేకపోయాడు . అంతే తప్ప అక్కడ ఏమీ లేదు. కాబట్టి ఒక మాట మాట్లాడే ముందు నిజాలు తెలుసుకొని మాట్లాడు, మీ నాయకుడి దగ్గర నువ్వు భుజం తట్టించుకోవాలనుకుంటే ఇంకే విషయంలో అయిన తట్టించుకో భాషా. నిజాలు మాట్లాడి నిజాయితీగా ప్రజల పక్షాన పోరాడి ఏదైనా భుజం తట్టించుకుంటే బాగుంటుంది. వైకాపా పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ కొత్త మంది గురించి మాట్లాడడం మాకు విలువ లేకుండా పోతుంది. మీ గురించి ప్రెస్ మీట్ లో మాట్లాడే స్థాయి కాదు. మీ పార్టీలోనే మీకు గుర్తింపు లేదు ఏదో మీ కులంను వాడుకోవడం కోసం మిమ్మల్ని ఈరోజు ముందు పెట్టారు. వాళ్ళు మిమ్మల్ని పావుగా వాడుతున్నారు తప్ప మీకు అక్కడ విలువ ఏమీ లేదనే విషయం మీకు కూడా బాగా తెలుసు. సరే మచ్చుకు ఒక విషయం ఒకటి బయట చెప్తాను బషీర్ హాస్పిటల్ ఎదురుగా ఒక అంగడికి పంచాయతీ ఆఫీస్ లో అక్రమంగా అప్రూవల్ ఇప్పించావు, దానికి లక్ష రూపాయలు వసూలు చేసినావు ఆ విషయం గురించి అందరికి తెలుసు. రేణిగుంట సర్పంచ్ నగేష్ మాట్లాడుతూ రేణిగుంట పంచాయతీ వార్డు సభ్యులందరూ ఐకమత్యంగా ఉన్నారని అందరం కలిసి రేణిగుంటను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు జువ్వల దయాకర్ రెడ్డి, సుజాత, వార్డు సభ్యులు ఈశ్వరి, రమణ, కృష్ణమూర్తి , చైతన్య, ఎర్రబ్బి, రిహాన్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు వరం పశు బీమా పథకం: చింతల

విశాలాంధ్ర-పీలేరు:-వైయస్సార్ పశు బీమా పథకం పాడి రైతులకు వరం లాంటిదని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం వాల్మీకిపురం మండలం బూడిదవేడు గ్రామంలో పశు బీమా పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పాడి రైతుల శ్రేయస్సు కోరి సీఎం జగన్మోహన్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని , దీనివలన రైతులకు ఎంతో ఉపయోగం కలుగుతుందన్నారు. అనారోగ్యం రీత్యా గాని, ప్రమాదవశాత్తు గాని పశువులు మరిణిస్తే ప్రీమియంను బట్టి రూ. 30 వేలకు పైగా బీమా సాయం పొందవచ్చునని ఆయన తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లోని పలువురి రైతులు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారని , ఇంకా బీమా చేసుకొని రైతులు ఈ నెలాఖరులోపు చేసుకోవాలన్నారు. రైతుల సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ ఆశయమని, రైతులు బాగుంటేనే సమాజం ప్రగతి పథాన నడుస్తోందన్నారు. ఆర్బీకే కేంద్రాల ద్వారా రైతులుకు ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు, రైతు భరోసా పథకం రైతుల ఆత్మస్థైర్యాన్ని నింపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, వాల్మీకిపురం ఉపసర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు హేమలత , సరిత, సహాయకులు ఫర్హత్ , సురేంద్ర రెడ్డి రైతులు పాల్గొన్నారు.

పీలేరులో పొట్టేళ్లకు పెరిగిన గిరాకీ

విశాలాంధ్ర-పీలేరు:- ఈనెల 29న ముస్లిం సోదరుల పవిత్రమైన బక్రీద్ పండుగ సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డులో పొట్టేళ్లకు భలే గిరాకీ పెరిగింది. ఆదివారం కావడంతో పీలేరు నియోజకవర్గం నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి మరియు కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా పొట్టేళ్ల కోసం మార్కెట్ యార్డ్ కు వ్యాపారస్తులు అధిక సంఖలో విచ్చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ ఇవ్వడానికి ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో మార్కెట్ యార్డ్ కు రావడంతో పొట్టేళ్లకు ఆకాశాన్ని అంటే విధంగా ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.కేవలం 35 నుంచి 40 కేజీల మధ్య ఉన్న పొట్టేలుకు ఒక్కసారిగా 90 వేలకు గిరాకీ పెరిగింది. అయినా పోటీపడి వ్యాపారస్తులు పొట్టేళ్లను కొనడం కోసమెరుపు.

మాతమ్మకు సారె సమర్పించిన చెవిరెడ్డి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్:తిరుపతి రూరల్ మండలం గొల్లపల్లి దళితవాడలో కొలువైన శ్రీ మాతమ్మ కొలుపు ను పురస్కరించుకుని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి సారెను సమర్పించారు.అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో చివరి రోజైన ఆదివారం పట్టు వస్త్రాలు సమర్పించారు.ఆలయం వ్యవస్థాపక ధర్మకర్త విడుదల మాధవ రెడ్డి సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు.ఆలయం వద్ద గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విడుదల రవి, నాగరాజు, గోపాల్ రెడ్డి, హరి, సురేష్, అయ్యప్ప, ఈశ్వరయ్య, సుబ్రమణ్యం, గోపిలు పాల్గొన్నారు.

13ఎర్రచందనం దుంగలు స్వాధీనం

విశాలాంధ్ర-తిరుపతి: రాజంపేట సానిపాయ పరిధిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో 13 ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మురళీదర్ అధ్వర్యంలో ఆర్ఐలు సురేష్ కుమార్ రెడ్డి, చిరంజీవులకు చెందిన టీమ్ లు శనివారం కూంబింగ్ చేపట్టాయి ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ టీమ్ సానిపాయ రేంజి లోని రాయవరం సెక్షన్ లో కూంబింగ్ చేపట్టారు. వీరు ముదుంపాడు ప్రాంతానికి చేరుకునే సరికి, కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళతూ కనపించారు. దీంతో వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, దుంగలు పడేసి పారిపోయారు. ఆ ప్రాంతంలో ఐదు ఎర్రచందనం దుంగలు లభించాయి. అదే విధంగా మురళీధర్ రెడ్డి టీమ్ రాజంపేట సమీపంలోని రోళ్ల మడుగు వద్ద కూంబింగ్ చేస్తుండగా, జిల్లాకోన వద్ద ఎర్రచందనం దుంగలతో వెళుతున్న స్మగ్లర్లు కనిపించారు. వీరిని సమీపించే సరికి దుంగలు పడేసి పారిపోయారు. ఆ ప్రాంతంలో 8దుంగలు లభాంచాయి. ఈ రెండు కేసులను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ లో కేసులు నమోదు చేయగా, సీఐ బాలకృష్ణ, ఎస్ఐ మోహన్ నాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర మంత్రి పర్యటనను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా కేంద్ర ఐటి సహాయ మంత్రి సోమవారం చిల్లకూరు జాతీయ రహదారిపై ఉన్న ఏ5 హోటల్ కు వస్తున్నట్లు బీజేపీ గూడూరు నియోజకవర్గ కన్వీనర్ పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దేవ్ సింగ్ చౌహాన్సీ బీజేపీ నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

డయల్ యువర్ స్విమ్స్ కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ స్విమ్స్ హాస్పిటల్ తిరుపతి నందు డయల్ యువర్ స్విమ్స్ కార్యక్రమంమంగళవారం ఉదయం 9.30 గం. నుండి 10.30 గం వరకు స్విమ్స్ కమిటీ హాల్ నందు నిర్వహించనున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. రామ్ గారు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ బి. వెంగమ్మ పాల్గొంటారని స్విమ్స్ హాస్పిటల్ పై మీ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు, సందేహాలు , ఈ ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా నేరుగా డైరెక్టర్‌తో మాట్లాడవచ్చునని రామ్ తెలియజేస్తున్నారు. ఇక పై ఈ కార్యక్రమం ప్రతినెల చివరి మంగళవారం రోజున జరుగుతుందని తెలియజేశారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 0877-2246188.

లయన్ వినుత ప్రకాష్ ఆద్వర్యంలో సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-తిరుపతి: లయన్ వినుతాప్రకాష్ ఆధ్వర్యంలో 2022 - 23 సంవత్సరంనకు గాను వివిధ విభాగాలలో ఉచిత సేవా కార్యక్రమాలు అందించినటువంటి ఉత్తమ క్లబ్బులకు మరియు క్లబ్బు ప్రెసిడెంట్ లకు అవార్డుల ప్రదానోత్సవ మహోత్సవ కార్యక్రమం బెంగళూరు పట్టణం, ఈస్ట్ కల్చరల్ అసోసియేషన్ ఇందిరానగర్ నందు ఘనంగా ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా తిరుపతి లయన్స్ క్లబ్బు విభాగంలో టాప్ వన్ స్థానం దక్కించుకున్నదన్నారు. అదేవిధంగా తిరుపతి లయన్స్ క్లబ్ చేసిన సేవా కార్యక్రమాలకు గాను డిస్ట్రిక్ట్ గవర్నర్ స్పెషల్ అప్రిసియేషన్ అవార్డును గవర్నర్ వినుతా ప్రకాష్ మరియు లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణారెడ్డిల చేతుల మీదుగా తిరుపతి క్లబ్ ప్రెసిడెంట్ భీమినేని మునికృష్ణ నాయుడు అవార్డు అందుకోవడంజరిగినది. ఈ సందర్భంగా మునికృష్ణ నాయుడు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మానవసేవయే మాధవసేవ , సేవలోని సంతృప్తి ఉంటుంది . సేవే పరమాత్మ అన్న ఆలోచనతో తాను సేవా రంగాన్ని ఎంచుకోవడం జరిగిందన్నారు . క్లబ్బు కార్యదర్శి చిత్ర మోహన్, ట్రెజరర్ ముబారక్ భాషా, క్లబ్ సభ్యులు అందరి సహకారంతో ఈ అవార్డులు సాధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ ముబారక్ భాషా, క్లబ్ సభ్యులు మోహన్ సుందరం, జోన్ చైర్మన్ ఎం .భాస్కర్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిప్లొమాలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా మేనేజర్ శ్యామ్ మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాయుడుపేటలోని అరబిందో కంపెనీలో ఉద్యోగాలకు ఈనెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు గూడూరు లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ డిప్లొమో ఉత్తీర్ణులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా



గంగమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే వెంకటే గౌడ

విశాలాంధ్ర- పలమనేరు: రూరల్ మండలంలోని కోలమాసనపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ఎగువ కూర్మాయి గ్రామాలలో శ్రీ గంగమాంబ జాతరలో పలమనేరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వెంకటే గౌడ గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యే కి పూల మాలలు వేసి సేలవ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ గజేంద్ర, సర్పంచుల సంఘం అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, వీరభద్ర, అమర్నాథ్ రెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాధాలకు చేయూతనందించిన ముస్లీమ్ జేఏసీ

విశాలాంధ్ర-బంగారుపాళ్యం: ముస్లిం జేఏసీ వారి ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్ స్టేషన్ పక్కనగల ఆర్టీసీ పరిధిలో అశుభ్రంగా ఉన్న అనాధ వృద్ధులను తీసుకొచ్చి వారిని కటింగ్ షేవింగ్ చేయించి శుభ్రపరసి వారికి కొత్త దుస్తులను అందజేశారు. ముస్లిం జేఏసీ అధ్యక్షులు అన్ను మాట్లాడుతూ అనాధలు అశుభ్రంగా ఉండటంవల్ల అనేక రోగాలు బారిన పడతారని, దానికోసం ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమం ప్రతినెల నిర్వహిస్తామని, మండలంలోని అనాధ వృద్ధులుసద్వినియోగం చేసుకోవాలని అన్ను కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బంగారుళ్యం అప్డేట్ పోలీస్ స్టేషన్ సిఐ నాగరాజు రావు , బంగారుపాళ్యం ముస్లిం జేఏసీ వారు చిత్తూరు ఎథికల్ సాదిక్ వారి బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ముస్లిం జేఏసీ సభ్యులు, జేఏసీ వైస్ ప్రెసిడెంట్ లాలు , జేఏసీ సెక్రెటరీ జిలానీ బాషా,కోశాధికారి షంషీర్,మాలిక్, సేట, దిల్కుష్, సమీర్, మానవసేవ బృందం వారు పాల్గొన్నారు.

మాజీ డిసిసి అధ్యక్షులు సుధాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-పలమనేరు : స్థానిక పట్టణంలోని మారెమ్మ గుడి వద్ద నివాసం ఉంటున్న మాజీ డిసిసి అధ్యక్షులు, బలిజ అభ్యుదయ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు సుధాకర్ అన్నకు జన్మదిన శుభాకాంక్షలుపి జెసిబాబు, కార్యదర్శి కిరణ్, ఆకుల గజేంద్రప్రసాద్, చెంచు రెడ్డి, సుబ్బ నాగయ్య, పగడాల ప్రవీణ్ అమ్ములు వాసు,కోటి, శ్యామ్,సోమన్న, శంకర, శివ, రమణ,వెంకటరమణ, పుష్పాల వెంకటేశ్వర్లు, నరేష్, హరీష్, హేమంత్, శ్రీధర్, లక్ష్మీపతి, రఘునాథ్,ఇంటి మనోహర్, ఇంటి సంపత్, దైవప్రసాద్,మంజునాథ్, సుదర్శన్ బాలాజీ, చంద్రన్న,మునిరాజా,సుబ్రహ్మణ్యం, రాజేష్,వివిధ పార్టీల నాయకుడు ప్రజా ప్రతినిధులు బలిజ సంఘం కుటుంబ సభ్యులు ఆయనకు పూలమాలలు వేసి శాలువా కప్పి పలువురు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు వార్డు కార్యదర్శుల అంతర్ జిల్లాల బదిలీల కౌన్సిలింగ్

విశాలాంధ్ర-చిత్తూరు : వార్డు సచివాలయ కార్యదర్శుల అంతర్ జిల్లాల బదిలీలకు సంబంధించి సోమవారం నగరపాలక కార్యాలయంలో కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ అరుణ తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం అంతర్ జిల్లాల బదిలీల ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని నాలుగు రీజనళ్ల అనంతపురం, గుంటూరు, రాజమండ్రి, వైజాగ్ పరిధిలోని జిల్లాల నుంచి చిత్తూరు జిల్లాలోని నగరపాలక/పురపాలక సంఘాలకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వార్డు కార్యదర్శులు సోమవారం నిర్వహించే కౌన్సిలింగ్ కు హాజరు కావాలన్నారు. వార్డు కార్యదర్శులు ప్రభుత్వం నిర్దేశించిన రికార్డులను తీసుకొని ఉదయం 10.30 గంటలకు చిత్తూరు నగరపాలక కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

పాఠశాలల్లో ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు

విశాలాంధ్ర -చిత్తూరు : నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాజా పరిస్థితులపై అధికారుల బృందాలు ప్రత్యేక పరిశీలన చేపట్టాయి. యాదమరి మండలంలో పాఠశాల వద్ద నన్ను గోతిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు నగర కమిషనర్ అరుణ నగరపాలక సంస్థ పరిధిలోని పాఠశాలలో స్థితిగతులపై ప్రత్యేక పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకోసం సహాయ కమిషనర్ గోవర్ధన్, ఏసీపీ రామకృష్ణుడు , ఆర్వో వర్మ, సీఎంఎం గోపి ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను నియమించారు. వీరితోపాటు ఇంజనీరింగ్ శాఖ అధికారులు, అమినిటీ కార్యదర్శులు నగరపాలక సంస్థ పరిధిలోని 40 పాఠశాలలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా పాఠశాలలో నాడు -నేడు పనులు జరుగుతున్న తీరు, ఓపెన్ సంపులు ఉన్నాయా! ఉంటే రక్షణ చర్యలు తీసుకున్నారా లేదా? ఇతర ప్రమాదకర గుంతలు ఉన్నాయా? తాగునీటి ట్యాంకులకు మూతలు ఉన్నాయా లేవా? శిథిలావస్థలోని ప్రహరీ గోడలు, పాఠశాలల్లో విద్యుత్ వైర్లు ఏమైనా ప్రమాదకరంగా ఉన్నాయా? ఎర్త్ ఏర్పాట్లు చేశారా లేదా అనే అంశాలపై ప్రత్యక్ష పరిశీలన చేసి నివేదికను అందించారు. ఈ నివేదిక ఆధారంగా ఎక్కడైనా ప్రమాదకర పరిస్థితిలో ఉంటే సత్వరం రక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నాడు-నేడు పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయించాలన్నారు.

బోయకొండ ఆలయంలో శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకాలు

విశాలాంధ్ర -చౌడేపల్లి: రాష్ట్రంలో రెండవ ప్రముఖ శక్తిక్షేత్రంగా విరాజిల్లుతున్న,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకాలు నిర్వహించారు.ఇందులో భాగంగా అమ్మవారిని ఆలయ అర్చకులు విశేషంగా అలంకరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో రాహుకాల అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు.ఈ అభిషేకంలో పాల్గొనే భక్తులు ముందుగానే తమ రసీదును పొందాలన్నారు.ఈ అభిషేకంలో పాల్గొంటే ఎంతో పుణ్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసమన్నారు.ఇటీవల కాలంలో రాహుకాల అభిషేకాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం శుభ పరిణామన్నారు.ఇందులో పాల్గొన్న భక్తులకు ప్రత్యేకంగా అమ్మవారి తీర్థప్రసాదాలు,తీర్థాలను అందజేయడం జరుగుతుందన్నారు.ఈ అభిషేకాలకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో బోయకొండ ఆలయ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-పుంగనూరు: మున్సిపల్ పరిధిలో గత కొద్దిరోజుల ముందట నక్కబండకు చెందిన ఆసిఫ్ విద్యుత్ ప్రమాదంలో మరణించినందుకుగాను అలాగే మార్కర్స్ కాలనీ కి చెందిన చాంద్ బాషా రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఈ రెండు ప్రమాద బాధిత కుటుంబాలకు ఆదివారం రోజున మున్సిపల్ చైర్మన్ హలీం భాష అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒక్కొక్కరికి ఐదు లక్షలు చొప్పున చెక్కులు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రమాదాలు వలన నిరాసితులైన కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత మాకు ఉన్నదన్నారు అందులో భాగంగా ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవడం జరిగిందని తెలియజేశారు విద్యుత్ ప్రమాదంలో మరణించిన కుటుంబానికి విద్యుత్ శాఖ నుండి ఉద్యోగం అవకాశం కల్పించే విధంగా కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డప్ప జానపద కళల చైర్మన్ కొండవీటి నాగభూషణం వైస్ చైర్మన్ కొండవీటి నాగేంద్ర కౌన్సిలర్ ఎండి అమ్ము నాయకులు ఖాదర్ బాషా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు పటిష్ట చర్యలు:కలెక్టర్

మండలాల వారీగా నివేదికల సేకరణ

విశాలాంధ్ర -చిత్తూరు: జిల్లాలో ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేకకార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కలెక్టర్ సగిలి షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు లు రంగం సిద్ధం చేశారు. మండలాల వారిగా ప్రభుత్వభూమి వివరాలను సమగ్రంగా అందించాలని తాసిల్దార్ లకు ఆదేశాలు జారీ చేశారు.ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లకు, తహసీల్దార్ లకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా ప్రణాళికను అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.ఎవరైనా ఆక్రమితదారులు ప్రభుత్వ భూముల్లో ఉంటే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ భూములు అక్రమంగా అమ్మకాలు చేయడం చట్టరీత్యా నేరమున్న విషయాన్ని గ్రామీణ ప్రజలకు తెలిసే విధంగా చర్యలు చేపట్టారు.ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ బృందాలు ఆయా మండలాల్లో సర్వే నెంబర్లతో పాటు వివరాలను సేకరించే పనిలోనిమగ్నమయ్యారు. ప్రతి మండలంలోని గ్రామాల వారిగా ప్రభుత్వ భూమి వివరాలను సేకరించి నివేదికలను కలెక్టర్ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.ఇప్పటికే చిత్తూరు మండల పరిధిలోని పెద్దిశెట్టిపల్లి గ్రామం వద్ద సర్వే నెంబర్ 130, తిమ్మసముద్రం వద్ద సర్వే నెంబర్ 89/11 ను ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డులు పెట్టడం జరిగింది. మిగిలిన మండలాల నివేదికలు అందిన తర్వాత వాటిని పరిశీలించి తగు చర్యలుచేపట్టనున్నారు. నిర్దేశిత సమయంలోపు అన్యాక్రాంతం కు గురైన ప్రభుత్వ భూమి వివరాలను ఆయా తహసీల్దార్ లు తప్పనిసరిగా పంపాలని కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనే ప్రభుత్వ భూముల సమగ్ర వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సేకరించి నివేదికలను తదుపరి ప్రత్యేక బృందాలు పరిశీలించనున్నాయి. మండల స్థాయిలో ఎక్కడైనా ప్రభుత్వ భూమి ఉన్న ఇతరులు ఎవరైనా ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని ఉన్న వాటిని మండల స్థాయి అధికారులు నివేదికలో చూపెట్టకపోతే అటువంటి తాసిల్దార్ ల పైన క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు

ఉపాధి హామీ పనుల వద్ద సౌకర్యాలు కరువు

- తాగునీరు కూడా అందించలేని దైన్యం - తగ్గిపోతున్న కూలీలు - పథక లక్ష్యాలు గాలికి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తద్వారా కూలీల సంఖ్య కూడా తగ్గిపోతున్న పరిస్థితి పై ప్రత్యేక కథనం.

విశాలాంధ్ర-వెదురుకుప్పం: మండలంలో మొత్తం7355 జాబ్ కార్డులు ఉన్నాయి.కాగా 15882 మంది కూలీలు వున్నారు.ప్రస్తుతానికి సుమారు 2000 మంది కూలీలు ఉపాధి హామీ పథకం లో పని చేస్తున్నారు. కనీస వేతనం 272 రూపాయిలు,గిట్టుబాటు కూలీ సరాసరి గా 260 రూపాయిలు చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో మే 28 వ తేదీ వరకు కూలీల చెల్లింపులు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. గతంలో 2015-16 సంవత్సరం లో ఉపాధి కూలీలకు గడ్డ పారలు, నీడ కల్పించేందుకు పట్టలు ఏర్పాటుచేశారు.అనంతరం2019- 2020 సంవత్సరం లో మజ్జిగ పాకెట్ లు సరఫరా చేశారు.ఆ తర్వాత ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు.ఎండల తీవ్రతకు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదని తెలుస్తోంది.ప్రధానంగా నీడ,తాగునీరు, ప్రమాదవశాత్తు కూలీల కు గాయాలయినా, సొమ్మసిల్లినా తక్షణ సౌకర్యంగా వాడే మెడికల్ కిట్ కూడా ఆపేశారు.తాగునీరు ఏర్పాటు చేయడం కూడా మరిచారు అంటే పథక లక్ష్యం ఏపాటి గా నీరుగారుతుందో అర్థం చేసుకోవచ్చు.తద్వారా ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో జాబ్ కార్డుకి 100 రోజులు పని కల్పించాలని నిబంధనలు ఉన్నాయి.అయితే ప్రభుత్వం ఉపాధి కూలీలకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలు కల్పించక పోవడం పై విమర్శలు వచ్చిపడుతున్నాయి. గతం లో ఉపాధి హామీ కూలీలు గ్రూపులు గా వుండేవారు.వారికి సౌకర్యాలు ఏర్పాటుకు మేటి ల వ్యవస్థ ఉండేది.వారికి కొంత డబ్బులు అదనంగా కూడా కేటాయించేవారు.ప్రస్తుతం ప్రభుత్వం సౌకర్యాలు ఏర్పాటు పై పూర్తిగా విఫలమవడం తో ఉపాధి హామీ పథకం అమలు పై కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఏపీడి శోభబాబు వివరణ కోరగా ఉపాధి హామీ పనుల వద్ద గతం లో నీడ, నీరు,మెడికల్ కిట్ తదితర సదుపాయాలు ఉండేవి.2021 డిసెంబర్ లో కొత్త సాఫ్ట్వేర్ నిబంధనలు వచ్చాక గడ్డపారలు,నీరు,మజ్జిగ,మెడికల్ కిట్ వంటి సౌకర్యాలకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక బడ్జెట్ లేదు.దీంతో అప్పటినుంచి సౌకర్యాలు,వసతుల కల్పన చెయ్యలేదని ఆయన వివారించారు.పని కోరిన కూలీలందరికి పని కల్పించడం జరుగుతుందని చెప్పారు.

పాత్రికేయుని కుటుంబాన్ని పరామర్శించిన నేతలు

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఐ న్యూస్ ఛానల్ పాత్రికేయుడు ఎంజిఆర్ తండ్రి మునుస్వామి తిరుపతిలో చికిత్స పొందుతూ శనివారం మరణించారు. నేపథ్యంలో ఆదివారం గంగాధర నెల్లూరులో అంత్యక్రియలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత నూక తోటి రాజేష్ మండల పార్టీ అధ్యక్షులు పూర్ణచంద్రారెడ్డి రాష్ట్ర బ్యూటీప్ కమిటీ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి టిడిపి నేతలు భీమనేని చిట్టిబాబు నాయుడు మండల పార్టీ అధ్యక్షులు స్వామిదాస్ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం గ్యాస్ రవికుమార్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ జనసేన ఇన్చార్జి యుగంధర్లతో పాటు చిత్తూరు పాత్రికేయులు గంగాధర్ నెల్లూరు నియోజవర్గం చెందిన పాత్రికేయులు తో పాటు వెదురుకుప్పం మండలం మాజీ టిడిపి అధ్యక్షులు మోహన మురళి గంగాధర నెల్లూరు నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు గుండయ్య లతో పాటు పలువురు వైకాపా టిడిపి జనసేన కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని మునుస్వామికి నివాళులర్పించి ఎంజీఆర్ సోదరుడు అన్నా దురైకు సంతాపం తెలియజేశారు.

విద్యార్థులకు చేతి రుమాళ్ళ పంపిణీ

విశాలాంధ్ర- పలమనేరు : పలమనేరులోని ఎస్సీ మరియు బీసీ వసతి గృహంలోని 150 మంది విద్యార్థులకు చిత్తూరు జిల్లా వసతి గృహ సేవా సంఘం అధ్యక్షులు ముని యప్ప పలమనేరు సేవా సంఘ కార్యకర్త మధుమోహన్ సంఘ సంస్కర్త యోగ గురువు నందగోపాల్ విద్యార్థులకు చదువు విషయం పట్ల అవగాహనను యోగ పట్ల అవగాహనను సంఘం పట్ల మన వంతుగా ఏం చేయాలని వీరు విద్యార్థులకు హితవు పలికారు.విద్యార్థులకు చేతి రుమాళ్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్లు సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సచివాలయం ఎంప్లాయ్ ఫెడరేషన్ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులుగా రమణ

విశాలాంధ్ర-కార్వేటినగరం : విజయవాడ ఏపీ ఎన్జీవో కార్యాలయం నందు ఆదివారం జరిగిన రాష్ట్ర సమావేశంలో చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం డిఎం పురం సచివాలయంలో పనిచేస్తున్న విలేజ్ సర్వేయర్ ఏ. రమణ గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయ్ ఫెడరేషన్ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులుగా నియామకం పొందడం జరిగింది.డి. జానీ భాష ఆధ్వర్యంలో విజయవాడలో నియమక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. హరి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి. తిరుమలయ్య పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

విశాలాంధ్ర-వరదయ్యపాలెం: వరదయ్యపాలెం పంచాయతీ గోపాలరావు కాలనీ వద్ద ఆదివారం రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట (జూదం) స్థావరంపై ఎస్సై నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు చేపట్టారు. ఈ దాడులో పట్టుబడ్డ వరదయ్యపాలెం పంచాయతీ బీసీ కాలనీకి చెందిన పి. మనోహర్, శాటిలైట్ కాలనీకి చెందిన నాగయ్య,సురేష్, రమణయ్య హరిజనవాడకు చెందిన రవి, చిన్న పిచ్చయ్య, మనోహర్ లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ6270లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జున రెడ్డి తెలిపారు.ఈ దాడుల్లో ఏఎస్సై శన్ముగం, పోలీస్ సిబ్బంది హరి, కిరణ్ సుధీర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు

పోలవరం నిర్వసితుల పోరు కేకను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పలమనేరు: స్థానిక పట్టణంలోని సిపిఎం ఆఫీసు వద్ద ఆదివారం పోలవరం నిర్వసితుల పోరు కేక పాదయాత్ర పోస్టరు ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు మాట్లాడుతూ... పోలవరం ముంపు మండలాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేసినట్టున్నాయని అసలు ఇండియా మ్యాప్ నుంచే విలీన మండలాలను తొలగించినట్లు అనిపిస్తోందని సీపీఎం నాయకులు అన్నారు. నిర్వాసితుల సమస్యలపై జూన్ 20న మహా పాదయాత్ర ప్రారంభించారని ఎటపాక నుంచి అమరావతి వరకు పాదయాత్ర చేపట్టి నిర్వాసితుల గోడును పాలకుల ముందు సిపిఎం పార్టీ ఉంచుతుందన్నారు. పునరావాస చర్యలు కానరావడం లేదన్నారు. సీఎం చింతూరు పర్యటన సమయంలో నిర్వాసితులకు ఇచ్చిన హామీలన్నీ ఏమైపోయాయన్నారు. గతేడాది వరదల సమయంలో కనీసం తాగు నీటిని ఈ ప్రభుత్వం అందించలేకపోయిందన్నారు. విపక్షాలు సైతం నిర్వాసితుల గోడుపై ప్రశ్నించడం లేదన్నారు. ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి జిల్లా కార్యదర్శి ఈశ్వర్ మాట్లాడుతూ... సీపీఎం నిర్వాసితుల పక్షాన నిలుస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి ముంపు గ్రామంలో గ్రామ సభలు పెట్టి ప్రజాభిప్రాయం తీసుకొని ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేస్తామన్నారు. పిదప వరదల సమయం వస్తున్నందున ప్రభుత్వం మేలుకోవాలన్నారు. చిన్నపాటి వరదకే విలీన మండలాలు ముంపునకు గురవుతున్న విషయం గమనించాలన్నారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా జూన్ 15 నాటికే వరద సహాయక చర్యలకు ప్రభుత్వం సిద్ధం కావాల్సి ఉందన్నారు. ప్రజావ్యతిరేకత రాకముందే ప్రభుత్వం నిర్వాసితులకు చట్టపరంగా వర్తించే ప్రతి సదుపాయాన్నినష్ట పరిహారాన్ని అందజేయాలన్నారు. విలీన మండలాలకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి పర్యవేక్షణ జరిపించాలన్నారు. కాంటూరు కాకి లెక్కలు మాని క్షేత్ర స్థాయి పరిశీలన మేరకు ముంపును గుర్తించాలన్నారు. ఎటపాక మండలంలో తమ బృందం ఉపాధి హామీ పనులను పరిశీలన చేయగా కూలీలకు కనీస వసతులను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైన విషయం వెల్లడైందన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ డివిజన్ నాయకులు పాకాల సుబ్రహ్మణ్యం,గుర్రం సుబ్రహ్మణ్యం,సంపూర్ణమ్మ,బాబు,తదితరులు పాల్గొన్నారు.

ఓయమ్మ మృతికి మాజీ మంత్రి సంతాపం

విశాలాంధ్ర-పలమనేరు: రూరల్ మండలంలోని బయప్పగారిపల్లి పంచాయతీ మండీపేట కోటూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బాలాజీ గారి తల్లి ఓయమ్మ మృతికి సంతాపం తెలియజేసి ఆమె భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ మంత్రివర్యులు ఎన్. అమరనాథ రెడ్డి ఈ సందర్భంగా బాలాజీ కుటుంబీకులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెంట నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు జగదీష్ నాయుడు, పలమనేరు మండల పార్టీ ప్రెసిడెంట్ నాగరాజు రెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్, ఎంపీటీసీ లక్ష్మి నారాయణ,మాజీ ఎంపీపీ కుమారి భాస్కర్, మాజీఎంపీపీ గీత, సుబ్రహ్మణ్యం మందడి, హరి, గిరి, ఐటీడీపి రూరల్ ప్రధాన కార్యదర్శి సురేష్,వెంకటేష్, దొరస్వామి నాయుడు తదితరులు ఉన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: మండలంలోని ఒక రహస్య ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం ను ఆదివారం నాడు పోలీసులు పట్టుకున్నారు ఎస్ ఐ రామాంజనేయులు కథనం మేరకు 49 కొత్తపల్లి మిట్టకు చెందిన ప్రశాంత్ విజయ్ కుమార్ అనే వ్యక్తులు అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి ఆ వ్యక్తుల నుండి సుమారు 40 వేల రూపాయలు విలువగల మద్యం ప్యాకెట్లను సీజ్ చేశారు తర్వాత వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

ఘనంగా కుంభాభిషేక వేడుకలు

విశాలాంధ్ర -చిత్తూరు: చిత్తూరు నగరంలోని శ్రీ కృష్ణవిలాస సభ మహా కుంభాభిషేకం వేడుకలు ఘనంగా ముగిశాయి. శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాలస్వామి వారి ఆలయానికి వందేళ్ళకు పైగా చరిత్ర ఉన్నది. ఆలయ ధర్మకర్త ఏపి ముదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ ఆధ్వర్యంలో ఆలయాన్ని పూర్తిగా తొలగించి భక్తుల మనోభావాలకు అనుగుణంగా నూతన ఆలయ నిర్మాణం పూర్తి చేసారు. గత నాలుగురోజులుగా తమిళనాడు కాంచిపురం అత్తివరదర్ దేవాస్థానంకు చెందిన వేద పండితుల చేత ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలలో భాగంగా వివిధ రకాల స్వామి వారి కైంకర్యాలు, యాగాలు, ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం మహా సంప్రోషణ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా స్వామి వారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం , గోపుర పూజ, కలశ పూజ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చుడా చైర్మెన్ పురుషోత్తం రెడ్డి , మేయర్ అముద లతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తిరుకళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరం లోని ప్రముఖులు, వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర-కార్వేటినగరం : మండల పరిధిలోని అమ్మపల్లి పంచాయతీ ఎం.ఎం. ఆర్ కండిగా గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా ఆదివారం వారి కుమారులు కే.బ్రహ్మానందం రెడ్డి కోడలు గౌతమి, మనోహర్ రెడ్డి కోడలు నదియ, మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి, జ్యోతిష్యర్, దివ్యశ్రీ వారి ఆధ్వర్యంలో రాస్ వృద్ధ శ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించరు. ఈ కార్యక్రమంలో రాస్ పర్యవేక్షకులు ప్రకాష్, వృద్ధులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర -చిత్తూరు: భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా ఇంట్లోనేకూరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన చిత్తూరు నగరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే చిత్తూరు నగరంలోని గిరింపేట సిద్ధార్థ నగర్ ఏ ఎస్ ఎన్ టవర్స్ లో నివాసముంటున్న వినోద్ కుమార్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నారు. ఇతనికి 10 సంవత్సరాల క్రితం ప్రియా అనే మహిళతో వివాహమైంది అయింది. వారికి రెండవ తరగతి చదువుతున్న లోకాన్స్, ఏడాదిన్నర వయసు కలిగిన అన్విత్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. పెళ్లయినప్పటి నుంచి వీరి మధ్య తరచూ గొడవలు జరిగేది. ఈ నేపథ్యంలో అలిగిన భార్య ప్రియ బెడ్రూం లో వెళ్లి తలుపు వేసుకుంది. ఎంతసేపటికి బయటకి రాకపోవడంతో తలుపులు పగలగొట్టి చూడగా ప్రియా ఉరి వేసుకున్నట్టు గుర్తించి హుటాహుటిన గుడిపాల మండలం చీలపల్లి సిఎంసి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి మార్గమధ్యంలోనే మరణించినట్టు తెలిపారు. సమాచారం అందుకున్న రెండవ పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

వేడుకగా లక్కాగృహదహనం

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీదౌపదీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి లక్కాగృహ దహనం కార్యక్రమాన్ని భక్తులకు కనులకు కట్టి నట్లు శ్రీవెంకటేశ్వర నాటక కళామండలి ప్రదర్శించారు. అదే విధంగా మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ పాండవులు అరణ్యవాసంలో ఉన్నప్పుడు చేసిన లక్కాగృహ దహనాన్ని భక్తులను ఆకట్టుకునే విధంగా అభివర్ణించారు. ఉదయం ద్రౌపదీ ధర్మరాజుల వారి మూల విరాట్కు అర్చనకలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉభయ: దారులైన రజకులు అమ్మవారికి సమర్పించిన సారెతో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవ మూరు?లతో పాటు శ్రీకృష్ణుని సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి మంగళవాయిద్యాలు, బాణా సంచలు పేలుస్తూ గ్రామ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పాకల సోమనాథ్, కమిటీ సభ్యులు కె.హరిబాబు, ఎ.శివప్రకాష్: ఎ. బాబురెడ్డి, యం. క్రిష్ణయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర తిరుపతి జిల్లా



ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి : సిపిఐ

విశాలాంధ్ర - రేణిగుంట : జి పాలెంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని రేణిగుంట సిపిఐ మండల సమితి డిమాండు చేసింది. రేణిగుంట మండలం జి పాలెం గ్రామం సమీపంలోని స్వర్ణముఖి నదిలో గత నాలుగు రోజులుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నదని ఆదివారం ఏఐటియుసి జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతిరోజు చుట్టుపక్కల గ్రామస్తులు ఇసుకను తరలించకుండా అడ్డుకున్నారని తెలిపారు. పోలీసుల సహకారంతో ఇసుక అక్రమ రవాణా చేయడం జరుగుతున్నదని అన్నారు. అక్కడున్న హిటాచి మరియు ట్రాక్టర్లను తరిమేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో స్వర్ణముఖి నదిలోకి వెళ్లే దారిని హిటాచితో త్రవ్వేయదానికి ప్రయత్నించగా గాజుల మండ్యం ఎస్సై ధర్మారెడ్డి అడ్డుకోవడం చాలా దారుణం అన్నారు. సంఘటన స్థలం వద్ద పోలీసులకు నాయకులకు వాగ్వివాదం జరిగిందన్నారు. వేసిన దారిని మరల జెసిబితో తవ్వి ట్రాక్టర్లు స్వర్ణముఖి నదిలోనికి పోనివ్వకుండా చేయడం జరిగిందన్నారు. ఈ సమస్య ఇంతటితో ఆగదని అందుకోసం చుట్టుపక్కల గ్రామాలు నల్లపాలెం, కొత్తకాల్వ, జి.పాల్యం, జి.పాల్యం హరిజనవాడ తదితర గ్రామాల ప్రజలను కలుపుకొని రేపు జిల్లా కలెక్టర్‌ను కలవాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా సిపిఐ కార్యదర్శి నరసింహులు, శ్రీకాళహస్తి ఏఐటీయూసీ నాయకులు వైయస్ మణి, ఏర్పేడు మండల కార్యదర్శి ఆర్‌ఎస్కే మూర్తి, ఏర్పేడు మండల కార్యదర్శి శంకర్, అంబేద్కర్ సంఘం నాయకులు స్టార్ కృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమూరులో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర-వాకాడు: మండల పరిధిలోని తిరుమూరులో ఆదివారం టియంఆర్ యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా టియంఆర్ యూత్ నిర్వాహకులు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరుగుతున్న వాలీబాల్ టోర్నమెంట్‌కు తిరుమూరు ఎంపీటీసీ పుత్తేటి కృష్ణారెడ్డి ప్రముఖ పారిశ్రామికవేత్త గండవరం రామచంద్రారెడ్డి, కుంచం పవన్ ల సహకారంతో ప్రారంభించడం జరిగిందని పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ20116,ద్వితీయ బహుమతిరూ15116 తృతీయ బహుమతి రూ7116 లతో పాటుగా మెమొంటో లను బహుకరించడం జరుగుతుందని టోర్నమెంట్ లో పాల్గొనే క్రీడాకారులు రూ1000 ఎంట్రీ ఫీజు చెల్లించి టోర్నమెంట్ పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో టియంఆర్ యూత్ నిర్వాహకులు వాంజవాక రాగయ్య,పామంజి అశ్విని కుమార్,పామల సూర్య,పుచ్చలపల్లి ప్రసన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనివ్వాలి

విశాలాంధ్ర - గూడూరు : విద్యార్థులు ప్రయోజకులు అయిన తర్వాత వారు చదివిన విద్యా సంస్థల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని విశ్రాంత ఇండస్ట్రియల్ ఆఫీసర్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి వేగూరు శ్రీధర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు 1973 -74 విద్యా సంవత్సరం పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందించారు. అదే విధంగా పాఠశాలకు లైబ్రరీ సామాగ్రిని కూడా అందించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఇండస్ట్రియల్ ఆఫీసర్, పాఠశాల పూర్వ విద్యార్థి వేగూరు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి శక్తి మేర మా సంఘం ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకుని వారు చదువుకున్న విద్యాసంస్థల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భారతి, చిల్లకూరు మండల ఎంఈఓ రవూఫ్, ఇస్రో విశ్రాంత ఉద్యోగి పసుపులేటి ప్రసాద్, రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విజేతలుగా ఆంధ్రప్రదేశ్ జట్టు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి వేదికగా ఈ నెల 24 నుండి 25 వ తేదీ వరకు ఘనంగా 12వ జాతీయ స్థాయి తోంగ్-ఇల్-మూ-డో మార్షల్ ఆర్ట్స్ 2కె23 ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఓవరాల్ ఛాంపియన్షిప్ విజేతలుగా ఆంధ్ర ప్రదేశ్ జట్టు నిలిచింది, ద్వితీయ మరియు తృతీయ స్థానాలను పాండిచ్చేరి మరియు మహారాష్ట్ర రాష్ట్రాలు కైవసం చేసుకొన్నాయి. ఈ పోటీలు వివిధ రాష్ట్రాల నుండి ప్రతిభావంతులైన క్రీడాకారుల తో ఎంతో అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా స్కి అండ్ స్నోబోర్డ్ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అర్షద్, కర్లింగ్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి మహమద్ ద్యానిష్ ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ మెనేజ్ మెంట్ అసోసియేషన్ రాయలసీమ జోన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.విశ్వనాథ్ రెడ్డి, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ సయద్ సాహెబ్,రాష్ట్ర రోలర్ స్కి అసోసియేషన్ చైర్మన్ ఎస్.విశ్వ చందన్ రెడ్డి,రాష్ట్ర గ్రప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సురేంద్ర రెడ్డి ,తిరుపతి ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఆంజనేయులు నాయుడు,తోంగ్-ఇల్-మూ-డో ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు ఇందు మరియు ప్రధాన కార్యదర్శి మణికంఠన్,కర్ణాటక రాష్ట్ర సెక్రెటరీ రజాక్, తదితరులు పాల్గొని వివిధ విభాగాల్లో గెలిచిన వారికి మెడల్స్,ప్రశంసా పత్రాలను మరియు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులు మాట్లాడుతూ ప్రతి ఆటలో గెలుపోటములు సర్వసాధారణమని క్రీడాకారులు సమయస్ఫూర్తితో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని తెలిపారు. ఈ పోటీల అనంతరం క్రీడాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గేట్ వసూళ్ల నిలుపుదల హర్షణీయం:ఏఐటీయూసి

విశాలాంధ్ర - తిరుపతి : గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో వీధి వ్యాపారస్తుల నుండి ప్రతిరోజు వసూళ్లు చేస్తున్న గేట్ వసూళ్లు ఆపివేయాలని తీర్మానం చేయించిన నగర కమిషనర్ చేకూరి కీర్తికి వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ (ఏఐటీయూసీ) తిరుపతి జిల్లా సమితి ఆదివారం ప్రత్యేక అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సర్దార్ శివ మాట్లాడుతూ గుంటూరు నగర పాలక కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపల్, కార్పొరేషన్ పట్టణాల్లో ఈ తీర్మానం చేసి వీధి వ్యాపారస్తులకు అండగా ప్రభుత్వం నిలవాలని ఆయన కోరారు. అదేవిధంగా అన్ని కౌన్సిల్ సమావేశాలలో 2014 వీధి వ్యాపారుల చట్టం అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. మరోసారి గుంటూరు నగరపాలక కమిషనర్ చేకూరి కీర్తికి ఇలాంటి తీర్మానం చేయించడం వీధి వ్యాపారస్తులకు అండగా నిలబడటం చాలా శుభ పరిణామాన్ని ఇలాంటి మరిన్ని చర్యలు ఆమె తీసుకొని కార్మికులకు అండగా నిలవాలని ఆమెను మరోసారి అభినందనలు తెలుపుతున్నామన్నారు.

సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఘనంగా సాగిన యువగళం పాదయాత్ర

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట పట్టణపరిధిలో గాంధీమందిరం సెంటర్ వద్ద ఆదివారం నిర్వహించిన యువ గళం పాదయాత్ర బహిరంగ సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మాట్లాడుతూ, సూళ్లూరుపేట నియోజకవర్గం కమల్ హాసన్ స్థానిక శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య అని అన్నారు. పైకి తనకు ఏమీ తెలియని అమాయకుడిలా నటిస్తూ, లోపల ఆయన అనేక కార్యాలు నిర్వహిస్తారని అన్నారు. నియోజకవర్గంలో శ్రీ సిటీ సమీపంలో ఏ టి ఎస్ అంటే ఎనీ టైం శాండ్ పథకం నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ పథకం ద్వారా ఇతర రాష్ట్రాలకు ఎనీ టైం ఇసుక తరలింపు అక్రమంగా జరుగుతుందని ఆరోపించారు. రాష్ట్రమంతా జే బ్రాండ్ మద్యం సరఫరా అవుతుంటే, ఈ నియోజకవర్గ పరిధిలో కే బ్రాండ్ అనగా కర్ణాటక మద్యం దిగుమతి అవుతుందని ఆరోపించారు. రాష్ట్ర సరిహద్దులో పేకాట క్లబ్బులు నడుపుతున్నారని ఆరోపించారు. క్రికెట్ బెట్టింగ్, పేకాట క్లబ్బులు నిర్వహించే అనిల్ రెడ్డి వంటి అనుచరులతో కిలివేటి సంజీవయ్య కొనసాగుతున్నారని అన్నారు. శిరసనంబేడు కొండకు గుండు కొట్టి, అక్రమంగా గ్రావుల్ తరలించారని ఆరోపించారు. మాజీ మంత్రి అనిల్ యాదవ్ ముందు జగన్మోహన్ రెడ్డి చేత తనని నెల్లూరు టౌన్ అభ్యర్థిగా ప్రకటించుకోవాలని సవాల్ చేశారు వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కోర్టు దొంగ అని, కల్తీ మద్యం కేసులు నిందితుడని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే యువతను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని అన్నారు. సంవత్సరంలో మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని అన్నారు. ఈ ప్రభుత్వం ఆర్టీసీ బస్సు చార్జీలు మూడుసార్లు పెంచిందని గుర్తు చేశారు. మహిళలు ప్రయాణించేందుకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. నిందితులు ఏ స్థాయి వ్యక్తులైన సరే తాము అధికారంలోకి వస్తే వారు సింగపూర్ దేశంలో దక్కున్న వెతికి పట్టుకుని వచ్చి వారికి శిక్ష పడేలా చూస్తామని అన్నారు.

ఆరోగ్యకరమైన అలవాట్లతోనే ఆరోగ్యం పదిలం

-వ్యసనాలను విడనాడితే గుండె భద్రం - యోగా,ధ్యానంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలి

ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకటరమణ

విశాలాంధ్ర-తిరుపతి: ఆరోగ్యకరమైన అలవాట్లతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వెంకటరమణ హార్ట్ అండ్ మెటర్నరీ హాస్పిటల్ అధినేత,ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకటరమణ అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టులు,వారి కుటుంబ సభ్యుల కోసం కార్డియాక్, మెటర్నటీ ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురికి ప్రాథమిక వైద్య పరీక్షలతో పాటు ఈసీజీ,ఎకో వంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ,డాక్టర్ నిరుపమ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఒత్తిడి,ఆహారపు అలవాట్ల వల్ల గుండె సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జర్నలిస్టులు ఒత్తిడిని అధిగమించేందుకు యోగ, ధ్యానం,వ్యాయామంపై దృష్టి సారించాలన్నారు. వీటి సాధన వల్ల అనేక సమస్యలను మన దరి చేరవన్నారు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా స్మోకింగ్,ఆల్కహాల్ లకు బానిసలు అవ్వడం వలన ఎక్కువ మంది గుండె జబ్బులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితులలో ప్రతి ఒక్కరికి ఆరోగ్య భద్రత తప్పనిసరి పాటించాలన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామన్నారు. ప్రెస్ క్లబ్ సెక్రెటరీ బాలచంద్ర మాట్లాడుతూ జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా కమిటీ ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపు నిర్వహిస్తుందని చెప్పారు. ఇటీవల కాలం నుంచి అనేక మంది గుండె సంబంధిత అనారోగ్య సమస్యల ఎదుర్కొంటున్నారన్నారు. ఈ క్రమం లోనే ప్రముఖ వెంకటరమణ కార్డియాక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో జర్నలిస్టులు,వారి కుటుంబ సభ్యులకు గుండె సంబంధిత వైద్య పరీక్షలను నిర్వహించామన్నారు. రాబోవు రోజుల్లో ప్రెస్ క్లబ్ అభివృద్ధి సభ్యుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. ఈ వైద్య శిబిరంలో ఆసుపత్రికి చెందిన ఇతర వైద్యులు,వైద్య సిబ్బందితోపాటు సీనియర్ జర్నలిస్టులు,ప్రెస్ క్లబ్ కమిటీ జాయింట్ సెక్రెటరీ లావణ్య కుమార్,ఈసీ మెంబర్లు గల్లా మహేష్,సంజీవ సునీల్, పరందామరెడ్డి, కుమార్,మాజీ ప్రెస్ క్లబ్ కోశాధికారి శివ శంకరయ్య,మాజీ కమిటీ సభ్యులు పులిగోరు శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

అనిల్ కుమార్ నోరు అదుపులో పెట్టుకో : చక్రాల ఉష



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: నారా లోకేష్ ను విమర్శించేటపుడు నోరు అదుపులో పెట్టుకోవాలని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ను తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు చక్రాల ఉష హెచ్చరించారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నెల్లూరులో రౌడీయిజం చేస్తూ బతికే అనిల్ కుమార్ యాదవ్ తన స్థాయిని మరచి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. నారా లోకేష్ చేస్తున్నది పాదయాత్ర కాదని... జగన్ చేసింది మాత్రమే పాదయాత్ర అని అనిల్ కుమార్ యాదవ్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఆడవారికి ముద్దులు పెడుతూ పోతే నారా లోకేష్ మాత్రం ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నడుస్తున్నారని చక్రాల ఉష గుర్తు చేశారు. ఈ విషయం తెలుసుకోకుండా మాజీ మంత్రి అనిల్ కుమార్ మాట్లాడటం ఏమిటని ఆమె ప్రశ్నించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ అన్ని వర్గాల ప్రజలతో మమేమరం అవుతూ మారి సమస్యలు తెలుసుకుం టున్నారని చక్రాల ఉష చెప్పారు. నారా లోకేష్ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహించి వారి అభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటే నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలు మొత్తం అమలు చేస్తారన్నారు. జగన్ తన పాదయాత్రలో ఎక్కడెక్కడ ఇసుక, ఎర్రచందనం, మైనింగ్ ఉన్నాయో తెలుసుకుని అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ ప్రకృతి వనరులను దోచుకుంటున్నారని ఆమె ఆరోపించారు. జగన్ దోపిడీ గురించి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. అయితే తమ నేత నారా లోకేష్ అలా దోపిడీ చేసే వ్యక్తి కాదన్నారు. నారా లోకేష్ విజన్ ఉన్న యువనేత అని ఆమె కొనియాడారు. నెల్లూరు జిల్లాలో యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందన చూసి ఓర్వలేక మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అర్ధరహిత విమర్శలు చేస్తున్నారని చక్రాల ఉష అన్నారు. ఇకనైనా అనిల్ కుమార్ యాదవ్ అర్ధరహిత విమర్శలు మానుకోక పోతే ఆయనకు నెల్లూరు ప్రజలే తగు గుణపాఠం చెబుతారని చక్రాల ఉష హెచ్చరించారు.

టిడిపి నాయకునికి ఆనం పరామర్శ

విశాలాంధ్ర -బాలాయపల్లి: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రావి సత్యనారాయణ నాయుడు కి ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి వెంకటగిరి శాసన సభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి పరామర్శించారు. బాలాయపల్లి మండలం తెలుగుదేశం నాయకులు రావి సత్య నారాయణ నాయుడు వాళ్ళ అమ్మ విశాలాక్షి శుక్రవారం మరణించారు. విషయం తెలుసుకున్న వెంకటగిరి శాసన సభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి ఈరోజు వారి స్వగృహానికి చేరుకొని కుటుంబ సభ్యులు ను పరామర్శించారు. పరామర్శించిన వారిలో తెలుగుదేశం బాలాయపల్లి గ్రామ బూత్ కన్వీనర్ తాళ్లూరు ప్రసాద్ నాయుడు, వెంకటగిరి పోలేరమ్మ గుడి చైర్మన్ మురళి, బొల్లినేని ధనుంజయ నాయుడు, పల్లంటి రాంబాబు తదితరులు ఉన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి

విశాలాంధ్ర - గూడూరు : ఈ నెల 30వ తేదీన వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ గూడూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్ ల వద్ద నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డివిజన్ పరిధిలోని వామపక్షాల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల నిరసన తెలియజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం గూడూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో వామపక్షాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎడమ చేతితో పథకాల రూపంలో ప్రజలకు డబ్బులు ఇస్తూ, కుడి చేత్తో వారి వద్ద నుండి పన్నుల రూపంలో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి ప్రజా వ్యతిరేకతను కూడగట్టుకొని ఎన్నికల్లో ఓడిపోయిందని ఆయన గుర్తు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 30వ తేదిన తలపెట్టిన నిరసన కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో వామపక్ష నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జీ. శశి కుమార్, పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా, సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ముత్యాలయ్య, సిఐటియు ఆటో కార్మిక సంఘం నాయకులు బివి. రమణయ్య, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఎస్. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ధృవీకరణ పత్రాలు పంపిణి: ఆర్డీఓ

విశాలాంధ్ర - గూడూరు : ఆపద్బాంధవుడు ఆర్డీఓ అంటూ గూడూరు డివిజన్ ప్రజలు ఎం. కిరణ్ కుమార్ సేవలను కొనియాడుతున్నారు. గూడూరు పూలతోట గిరిజన కాలనీలో ముగ్గురు గిరిజన చిన్నారులకు ఆధార్, కుల ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో అమ్మ ఒడికి నోచుకోవడం లేదని శివ కళ అనే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు తెలుసుకున్నారు. వెంటనే ఈ విషయాన్ని స్థానిక విలేకరుల దృష్టికి తీసుకెళ్లగా వారు ఆర్డీఓకు తెలిపారు. దీనికి స్పందించిన ఆర్డీఓ ఆ గిరిజన కుటుంబాల రేషన్ కార్డులు గూడూరుకు మార్పించడమే కాకుండా కుల ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు 18గంటల్లోనే అందించి చరిత్ర సృష్టించారు. దీంతో ఆ గిరిజన కుటుంబాల ఆనందానికి హద్దుల్లేకుండా పోయాయి. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచని సమస్య కేవలం గంటల వ్యవధిలో పరిష్కారమవడంతో ఆర్డీఓకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా అమ్మ ఒడిని అనేక మంది అవగాహన లోపంతో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని తెలిపారు.

ఘనంగా సాక్షాత్కార వైభవోత్సవాలు

హనుమంత వాహనంపై శ్రీ కల్యాణ శ్రీనివాసుడు అభయం

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జరుగుతున్న సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాల్లో రెండో రోజైన ఆదివారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 10 నుండి 11 గంటల వరకు కల్యాణమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం రాత్రి 7 నుండి హనుమంత వాహనంపై స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులను కటాక్షించారు. జూన్ 26న గరుడ వాహనసేవ జరుగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో శ్రీ గోపీనాథ్, సూపరింటెండెంట్లు చంగలరాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం బహదూర్ పేట నల్ల గంగమ్మ గుడి ఆలయ ప్రాంగణంలో శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్, ఎంజీఎం ఆసుపత్రి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బహదూర్ పేట ప్రాంతానికి చెందిన సుమారు 150 మందికి పైగా ప్రజలు శిబిరానికి హాజరై ఉచితంగా వైద్య సేవలు పొందారు. సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వివేక్ చైతన్య మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్, ఎంజీఎం హాస్పిటల్స్ సంయుక్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ముందస్తుగా రోగాలను గుర్తించి సకాలంలో నయం చేయడమే లక్ష్యంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంజీఎంలో అందుబాటులో ఉన్న అధునాతన అత్యవసర వైద్యాన్ని శ్రీకాళహస్తి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆలయ కమిటీ చైర్మన్ కంఠా రమేష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కామేష్, సీనియర్ పాత్రికేయులు రవి, వీసి వెంకటయ్య, నెల్లూరు శ్రీను, సూర్య కుమార్, బాలు, తేజ, ఎంజీఎం వైద్యులు దినేష్, ఉమా మహేశ్వర్ రావు, దిలీప్, అర్చన, సిబ్బంది మధు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాయులింగేశ్వరుని సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో వెలసిన వాయులింగేశ్వరస్వామిని ఆదివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.నటరాజన్ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల పీఆర్వో విజయసారథి, సిబ్బంది పాల్గొన్నారు.

చెవిరెడ్డిని కలిసిన ఎంఈవోలు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు మండల విద్యాశాఖ అధికారి -2 స్థానంలో కొత్తగా బాధ్యత తీసుకున్న వారంతా ఆదివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని తుమ్మలగుంటలోని తన ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. చంద్రగిరి నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో ఎంఈవో -2గా నియమితులైన లింగయ్య (పాకాల), భాస్కర్ బాబు (చంద్రగిరి), సతీష్ (వైవీ పాళెం) గోపి (చిన్నగొట్టిగల్లు), శంకరయ్య (తిరుపతి రూరల్) జయవేలు (ఆర్సీ పురం) ఎమ్మెల్యే చెవిరెడ్డిని కలసిన వారిలో వున్నారు.

అభాగ్యులను ఆదుకోవడమే రోటరీ వెస్ట్ ధ్యేయం

విశాలాంధ్ర - గూడూరు : ఐభాగ్యులను ఆదుకోవడమే రోటరీ వెస్ట్ క్లబ్ లక్ష్యమని ఆ క్లబ్ అధ్రక్షులు బండి ధనుౙజయ్ రెడ్డి అన్నారు. ఆదివారం డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో దివ్యాంగులకు రోటరీ క్లబ్ గూడూర్ వెస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగుల భరోసా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్లసిరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ధనంజయ రెడ్డి వెస్ట్ క్లబ్ ధ్యక్షుడైన తర్వాత చేపట్టిన కార్యక్రమం 100వ కార్యక్రమం ఫల సరుకుల పంపిణీ అన్నారు. తర్వాత రాబోయే అధ్యక్షుడు కూడా ఇదేవిధంగా ప్రతి కార్యక్రమం క్రమం తప్పకుండా చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక సామాజిక కార్యక్రమాలు, పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందనలు తెలిపారు. దివ్యాంగులైన వీరికి ప్రతి నెల క్రమం తప్పకుండా ఫలసరుకులు పంపిణీ చేయడం చాలా గొప్ప విషయం అని కొనియాడారు. డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో ధనుంజయ రెడ్డి నేతృత్వంలో రోటరీ క్లబ్-గూడూర్ వెస్ట్ ఆధ్వర్యంలో నిరంతరం పేద ప్రజలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు చేపట్టారని, అదేవిధంగా క్రమం తప్పకుండా చేస్తున్న దివ్యాంగుల భరోసా, రోటరీ చేయూత కార్యక్రమాలతో నిరుపేదలకు ఎంతో ఉపయోగపడే విధంగా రూపకల్పన చేశారని, రాబోయే రోజుల్లో కూడా కొత్త ప్రెసిడెంట్ వచ్చిన తర్వాత ఈ కార్యక్రమాలు ఆగకుండా నిరంతరం కొనసాగించాలన్నారు. ప్రెసిడెంట్ ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలలో చేపడుతున్న ఈ దివ్యాంగుల భరోసా కార్యక్రమంతో దివ్యాంగులకు ఫల సరుకులు పంపిణీ చేస్తున్నామని, దీనికి సహకరించిన అనేకమంది దాతలకు, రొటీరియన్లకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం దివ్యాంగులకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా ఫలసరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసు గౌడ్, బొమ్మిడి శ్రీనివాసులు, నాసిన నాగులు, శివ రాఘవ రెడ్డి, సుబ్రహ్మణ్యం, విజయ భాస్కర్ రెడ్డి, బలరాంరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.